
# ప్రజాశక్తి

ఆదివారం 1 సెప్టెంబర్ 2024

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



## క్రీడా పరికరాలు వితరణ

**ప్రజాశక్తి-లింగసముద్రం:** మండల కేంద్రమైన లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి,వ్యాపారవేత్త కొట్టే నారాయణ పాఠశాల విద్యార్థులకు సుమారు 20వేలు విలువచేసే ఆట వస్తువులను అందజేశారు. శనివారం పాఠశాల ఆవరణలో వీటిని ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావుకు అందించారు. కొట్టే నారాయణ గతంలో అనేక సందర్భాలలో పాఠశాలకు సహకరించారని ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు.పూర్వ విద్యార్థి కొట్టే నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గర్వపడేలా తయారు కావాలని సూచించారు. తెలుగు భాషను ఆచార సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో పాఠశాల మొదటి సహాయకులు ఎం కొండయ్య,సిబ్బంది కార్యదర్శి కే ప్రభాకర్ పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.



పరికరాలు అందజేస్తున్న నారాయణ

# వాయు గుండం..అధికారులు అప్రమత్తం..!

◆కంట్రోల్ రూమ్ ఏర్పాటు
◆టోల్ ఫ్రీ నెంబర్ కేటాయింపు

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో శనివారం అక్కడక్కడా తుంపర్ల వర్షం పడింది.శ్రీకాకుళం- విశాఖపట్నం మధ్య తీరం దాటుతుందని అధికారులు చెప్పినా రాష్ట్ర వ్యాపితంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి..ఈ ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అప్రమత్తమయ్యారు.కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ మూడో తేదీ వరకు భారీ వర్షాల హెచ్చరికలు ఉండడంతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వర్షాలు కారణంగా ఎక్కడ ఏ సమస్య వచ్చినా తక్షణం ప్రజలు కంట్రోల్ రూమ్‌కు టోల్ ఫ్రీ నెంబర్‌కు 0861-2331261- 1077 కు తెలియజేయాలని కోరారు. కలెక్టరేట్‌లో 24 గంటలు మూడు షిఫ్టులలో సిబ్బందికి విధులు కేటాయించామని తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్‌లలో జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కాలువ గట్లు, చెరువుల వద్ద ఉన్న బండలు బలహీనంగా ఉన్నాయి. సోమశిల ఆఫ్రాన్ ఎప్పుడో దెబ్బతింది. దీని మరమ్మతుల కోసం నేటి ప్రభుత్వం ఇదిగో, అదిగో అంటూ ఉండడంతో ఇప్పుడు వర్షాలు వస్తుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంటుంది. ఇటీవల జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబునాయుడు మరో రెండుమూడు నెలలు ఆఫ్రాన్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మరో మూడు నెలలు భారీ వర్షాలు, వరదలు రానుండడంతో ఇప్పట్లో సోమశిల ఆఫ్రాన్ పనులు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో 2021లో ఆఫ్రాన్ దెబ్బతినడంతోపాటు, పెన్నా పరివాహక ప్రాంతాల్లో పోర్టు కట్టలు దెబ్బతిని భారీగా నష్టం జరిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే చెరువులు, నదీ పరివాహక ప్రాంతాల్లో దెబ్బతినే ప్రమాదం కనిపిస్తోంది. తుపాన్ ప్రభావం జిల్లాపై ఏలాంటి ప్రభావం చూపుతుందోనని భయం ఉంది. జిల్లా వ్యాపితంగా ఆర్‌డిఒ, తహశీల్దారులతోపాటు, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం చేశారు. మరో మూడురోజులు వర్ష సూచన ఉండడంతో ఏం జరుగుతుందో చూడాలి.





## ఒకరోజు ముందే పెన్షన్ల పండుగ

**ప్రజాశక్తి-నెల్లూరు:** పేదల లోగిళ్లలో పెన్షన్ల పండుగ ఒకరోజు ముందే వచ్చినందుకు సంతోషంతో ఆనంద పరవశులవుతున్నారని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నగరంలోని ఎన్టీఆర్ నగర్ రాయపుపాలెంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వివిధ రకాల పెన్షన్లను అందుకుంటున్న ఇంటింటికి వెళ్లి మంత్రి నారాయణ పెన్షన్ అందిస్తూ ఆయా కుటుంబాల సంతోషంలో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటవ తేదీ ఆదివారం కావడంతో పెన్షన్లను అందించే ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బంది పెట్టకుండా, అదే సమయంలో సామాజిక పెన్షన్లు అందుకునే వారికి ఆలస్యం కాకుండా, ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టవలసిందిగా ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఒకరోజు ముందుగా పెన్షన్ రావడంతో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారని, వారి సంతోషంలో తానుకూడా భాగస్వామినై నందుకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, స్థానిక నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ మేయర్ తాళ్లపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ అందజేస్తున్న మంత్రి

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి-నెల్లూరు:** జనసేన పార్టీ అధినేత ఆంధ్ర రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు భాగంగా 5వ రోజు నగరంలోని ఎబిఎం కాంపౌండ్ లో ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్, పంపిణీ చేశారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా తమ అభిమాన నాయకుడి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు పోతురాజు టోనీ బాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను చిన్నారుల మధ్యలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు జనసేన పార్టీ సీనియర్ నాయకురాలు లక్ష్మీ రంతుల్లా జిలాని భాయ్ ఖాజా మోహన్ శ్రావణ్ స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు

# అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి-నెల్లూరు**

కేంద్ర ప్రభుత్వ టూరిజం ప్రాజెక్టు ప్రసాద్ స్కీం ద్వారా నరసింహకొండ శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం రూరల్ మండలంలోని నరసింహకొండ శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని టూరిజం అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన టూరిజం ప్రాజెక్టు ప్రసాద్ కింద నరసింహకొండలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కలెక్టర్ టూరిజం అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలుత ఆలయానికి విచ్చేసిన కలెక్టర్ ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి ఎక్కడెక్కడక్కడ ఏయే అభివృద్ధి పనులు చేపట్టనున్నారో తెలుసుకున్నారు. ఆలయంలో రాగిపూత, శ్లాబు నిర్మాణ పనులు, అన్నదాన సత్రం విస్తరణ, భక్తుల విశ్రాంతి హాలు, టికెట్ కౌంటర్, క్లాక్ రూం, క్యూలైన్ల ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యం, ఆలయ సమీపంలోని దశావతరాల విగ్రహాల వద్ద పార్కుల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రసాద్ స్కీం ద్వారా ఆలయంలో అభివృద్ధి పనులకు రూ. 18.90 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టూరిజం ప్రాజెక్టు కింద ఆలయంలో అవసరమైన పనులకు తొలుత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భక్తులు, ఆలయ అర్చకులు, ట్రస్టుబోర్డు సభ్యులతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా భక్తులకు అవసరమైన కనీస అవసరాలపై దృష్టిపెట్టి భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా పనులు పూర్తిచేయాలన్నారు. ఆలయంలో భక్తులకు నీటి సమస్య లేకుండా శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన కలెక్టర్‌కు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కలెక్టరు వెంట జిల్లా పర్యాటకశాఖ అధికారి శ్రీనివాసరావు, డిఇ వంశీకష్ణ, ఆలయ ఈఓ సుధీర్ తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

# వైద్య రంగంలో రేడియాలజిస్టులదే కీలక పాత్ర

### - ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**ప్రజాశక్తి-నెల్లూరు**

అడ్వాన్స్‌డ్ ఇమేజింగ్ ద్వారా రోగ నిర్ధారణ చేస్తూ అద్భుతాలు ఆవిష్కరిస్తున్నారని కోవూరు నియోజకవర్గ శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రేడియాలజిస్టుల సేవలను ప్రశంశించారు. నెల్లూరు నగరంలో జరుగుతోన్న రాష్ట స్థాయి రేడియాలజిస్టుల వార్షిక సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ ను టెక్నాలజీతో అనుసంధానం చేసి వైద్య రంగంలో రేడియాలజిస్టులు విప్లవాత్మక మార్పులు తెస్తున్నారన్నారు. ఇమేజింగ్ సిస్టంతో పిన్ హోల్ విధానం ద్వారా శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా అందిస్తున్న వైద్య సేవల వల్ల రోగి త్వరగా కోలుకునే అవకాశముందన్నారు. రేడియాలజీ లో మెమోగ్రఫీ అనేది ముఖ్యమైనదని ప్రజలకు దీనిపై అవగాహనా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో కేన్సర్ వ్యాధి వస్తే సామాన్యులు ట్రీట్మెంట్ చేయించుకోలేని పరిస్థితి ఉండేదన్నారు. రేడియాలజి రంగం అభివృద్ధి చెందాక ప్రాథమిక దశలోనే వ్యాధి నిర్ధారణ చేసే పరిస్థితి ఉందన్నారు. రోగ నిర్ధారణ రంగంలో మరిన్ని పరిశోధనలు చేసి వైద్యాన్ని సులభతరం చేసి ప్రజలకు మేలు చేసే దిశగా కృషి చేయాలని కోరారు. ఈ రాష్ట్ర స్థాయి రేడియాలజిస్టుల వార్షిక సదస్సుకు పలువురు ప్రముఖ వైద్యులు, రేడియాలజిస్టులు పాల్గొని ప్రసంగించారు.



పూలబొకే అందజేస్తున్న దృశ్యం

## మెకానిక్‌ను కొట్టిన పోలీసులు..

**ప్రజాశక్తి-కందుకూరు**

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మందు తాగి వాహనం నడుపుతున్న మెకానిక్ ను పోలీసులు విచక్షణ రహితంగా కొట్టారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసు పెట్టాలిగాని కొట్టడం దారుణమైన చర్యగా మెకానికుల సంఘం పేర్కొంది.ఈ చర్యను కందుకూరు పట్టణ మోటార్ మెకానిక్ ల సంఘం తీవ్రంగా ఖండిస్తుంది. మెకానిక్ ను తీవ్రంగా కొట్టిన పోలీసులపై విచారణ జరిపి చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా పోలీస్ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కందుకూరు పట్టణ మోటార్ మెకానిక్ అసోసియేషన్ తరపున డిమాండ్ చేసింది.



## పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మేయర్ పరిశీలన

**ప్రజాశక్తి-నెల్లూరు**స్థానిక రామచంద్రాపురం,ఎఫ్‌సిఐ కాలనీల్లో ఉన్నటువంటి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మేయర్ స్రవంతి జయవర్ధన్ పరిశీలించి అక్కడ ఉన్నటువంటి ప్రజలతో వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు.శనివారం యుపిహెచ్‌సిల పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా విష జ్వరాలు వ్యాప్తి ఎక్కువ అవుతున్నటువంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నగర పాలక సంస్థ నుండి అన్ని ప్రాంతాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటు ఫాగింగ్, బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వంటి చర్యలు తీసుకుంటు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వారి పరిసర ప్రాంతాలని శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు..పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజలందరికీ ఎఎన్ఎంలు,ఆశా వర్కర్లు ఈ జ్వరాలకు సంబంధించినటువంటి లక్షణాలను గాని అనారోగ్య లక్షణాలు గాని తెలుసుకుని ప్రజలందరికీ అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.



మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

## ఆదర్శ అయ్యోరు ఫయాజ్‌కు సన్మానం

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు:** మండలంలోని చింతోపు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఆదర్శ ఉపాధ్యాయులు ఆదర్శ ఉపాధ్యాయుడు షేక్. ఫయాజ్ మహ్మద్‌కు శనివారం ఘన సన్మానం జరిగింది. ఆంగ్ల ఉపాధ్యాయులు షేక్ ఫ యాజ్ మహ్మద్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భ ంగా ఆయనకు సన్మానం జరిగింది. ఈ కార్య క్రమానికి ముఖ్యఅ తిథిగా మండల విద్యా శాఖ అధికారి -1, ఎస్. వేణు గోపాల్ రెడ్డి హాజర య్యారు. వేణుగోపాల్ రెడ్డి మాట్లా డుతూ ఆదర్శ ఉపాధ్యాయుడు ఫయాజ్ ఏ పాఠశాలలో పనిచేసిన అక్కడ వి ద్యార్థులలో ఇంగ్లీషు సబ్జెక్టులో పట్టు సాధించే విధంగా కృషి చేసేవారని కొనియాడారు. విద్యా శాఖ అధికారి- 2, డి. జయ రామనాయుడు మాట్లాడుతూ సన్మాన గ్రహీత ఫయా జ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 36 సంవత్సరాలు విద్యార్థులకు సేవనందించేందుకు ముఖ్య కారకులైన తల్లిదండ్రులకు, తనకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులకు, తన భార్య షేక్. నజీమున్నీసా కు ఎంతో రుణపడి ఉన్నానని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ చాట్ల వీణ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లి దండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


**ప్రజాశక్తి ఉలవపాడు:** :ఒక చెట్టు మన రేపటి కోసం అనే కార్యక్రమంలో భాగంగా శనివారం ఉలవపాడు ప్రాజెక్టు ఆవరణలో మొక్కలను మొక్కలను నాటారు. ప్రతి సెంటర్లో తల్లి పేరు మీద ఒక చెట్టు మన రేపటి కోసం నాటించాలని సి. డి.పి.ఓ టి.అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేపటి కోసం మానవాళి ఎంతో విలువైన ఆక్సిజన్ ఇచ్చే చెట్టును పెంచడం ప్రాముఖ్యత ఎంతో ఉందని ప్రతి ఒక ఇంట్లో, గ్రామాల్లో, అమ్మ పేరు మీద ఒక చెట్టు నాటాలని ఆమె పేర్కొన్నారు కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

**ప్రజాశక్తి-కందుకూరు:** రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని వాడవాడల జరపాలని కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన యాదవ్ కోరారు. జెడ్‌పిటిసిలు, ఎంపిటిసీలు, ఎంపీపీలు, సర్పంచులు, వివిధ స్థాయిలోని జిల్లా, పట్టణ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు అందరూ హాజరవ్వాలని పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రివర్యులు కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించి 15 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఘనంగా ఆ మహానేతకు వర్ధంతి నివాళులు అర్పించాలని కోరారు.

## తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు

**ప్రజాశక్తి-నెల్లూరు:** తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది సెలవులు రద్దు కాబడ్డాయని, ప్రతి ఒక్క ఉద్యోగి వారికి నిర్దేశించిన హెడ్‌క్వార్టర్‌లో అందుబాటులో ఉండాలని జిల్లా నోడల్ ఆఫీసర్ గా చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఆదిశేషయ్య ఆదేశాలు జారీ చేశారు. శనివారం విద్యుత్ భవన్ లో జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ వి.విజయన్ జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్,అసిస్టెంట్ ఇంజనీర్స్ తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ కారణంగా విద్యుత్తు సరఫరాల్లో అంతరాయాన్ని అధిగమించేందుకు జిల్లాలోని 7 డివిజన్లో , విద్యుత్ భవన్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఇ మాట్లాడుతూ తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కె.ఆదిశేషయ్య చీఫ్ జనరల్ మేనేజర్ జిల్లా నోడల్ ఆఫీసర్‌గా ఉన్నతాధికారులు నియమించారన్నారు.



జిల్లా నోడల్ ఆఫీసర్ ఆదిశేషయ్య

# పలుచోట్ల పింఛన్ల పంపిణీ



లింగసముద్రంలో పింఛన్ అందజేస్తున్న ఎంపిడిఒ శ్రీనివాసులు



కందుకూరులో



కోవూరులో

### 95 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి

**ప్రజాశక్తి-లింగసముద్రం**

మండలంలోని అన్ని గ్రామాల్లో పెన్షన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పంపిణీ చేశారని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు చెప్పారు.లింగ సముద్రం పంచాయతీలో పలువురికి పెన్షన్ అందజేశారు.శనివారం పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ఇతర సిబ్బందితో పెన్షన్ పంపిణీ ప్రారంభించారు.మండలంలో సుమారు 95 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి చేయడం జరిగిందని తెలియజేశారు. ఇతర ప్రాంతాల్లో ఉండే వారికి వివిధ పనులపై వేరే ప్రాంతాలకు వెళ్లిన వారికి మాత్రమే పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు.ఉదయం నుంచి వాతావరణం అనుకూలించకపోయిన వర్షం పడుతూ ఇబ్బందికర పరిస్థితిలో ఉన్నప్పటికీ సిబ్బంది పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎక్కడ ఆపకుండా పూర్తిచేయడం జరిగిందన్నారు.ఎప్పటికప్పుడు గ్రామాల వారీగా వివరాలు తెలుసుకుంటూ పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేశారన్నారు. సిబ్బంది సమిష్టిగా కృషి చేయడం వలనే మొదటి రోజే ఎక్కువ మందికి పెన్షన్ అందజేశామన్నారు.మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేస్తామని తెలియజేశారు.

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**

తెలుగుదేశం ప్రభుత్వం పెన్షన్ల ప్రక్రియను పక్కాగా అమ లు చేస్తోందని టీడీపీ సీనియర్ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు కొణతం రఘుబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని నరుకూరులో పెన్షన్ల పం పిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భం గా రఘుబాబు మాట్లాడుతూ సెప్టెంబర్‌కు సం బంధించిన 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు' ఒక రోజు ముం దుగానే అంటే ఈ నెల 31నే కూటమి ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు.

**ప్రజాశక్తి-కోవూరు**

కో వూ రు

నియోజకవర్గ శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచనలతో కోవూరు గ్రామపంచాయతీ పరిధిలోని బూత్ నెంబర్ 135 లో సచివాలయం సిబ్బంది కుసుమలతతో కలిసి దొమ్మర పాలెం, సాయిబాబా మందిరం వీధిలలో ఆగస్టు 31వతేదీ తెల్లవారుజామున 6 గంటలకే పింఛన్లు అందజేశారు. అవ్వాతాత ల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది..కార్యక్రమంలో బూత్ కన్వీనర్ నాటకరాణి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-గుడ్లూరు**


పింఛన్లు అధికారులు నేరుగా లబ్ధిదారుల గృహాలకు చేరుకుని శనివారం అందజేశారు. అర్ధరాత్రి నుంచి మొదలైన వర్షం ఆగకుండా శనివారం కురుస్తున్న వర్షంలోనే అధికారులు సామాజిక పింఛన్లు సుమారు 99 శాతం లబ్ధిదారులకి అందజేయడంపై వృద్ధులు, వికలాంగులు సంతోషం వ్యక్తం చేశారు

**ప్రజాశక్తి-కందుకూరు**

మండలంలోని మాచవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఉదయం 6 గంటలకు వర్షాన్ని కూడా లెక్క చేయకుండా లబ్ధిదారుల గడపగడపకు వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది ,గ్రామ పార్టీ నాయకులు సిహెచ్ మోహన్ రావు, మహేంద్ర పాలేటి నవీన్ ,దార్ల సతీష్ తదితరులు పాల్గొని ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

## ప్రజారక్షణ పోలీసుల బాధ్యత

**ప్రజాశక్తి-నెల్లూరు:** సమాజంలో శాంతి భద్రతలు పరిరక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే పోలీసుల ప్రధాన భాధ్యత అని ఎస్పి జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. శనివారం ఎస్పి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహిం చారు. మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి కావలి, ఆత్మకూరు, కందు కూరు సబ్ డివిజన్ పోలీసు అధికా రులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాలో చోటు చేసుకున్న, పెండింగ్ గ్రేవ్, నాన్ గ్రేవ్, అస్తి సంబంధిత నేరాలలో విచారణ గురించి సర్కిల్ వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీసు అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ పల్లె నిద్ర, గ్రామాల సందర్శన చేసి గ్రామంలోని సమస్యలు, ఆస్తి, నేరాలు, నివారణ చర్యలు, సైబర్ మోసాల గురించి, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల గురించి, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పోక్సో కేసులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దష్టి సారించి, కేసులు దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత గడువులోపు సంబంధిత కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయాలని సూచనలు చేశారు. రౌడీ షీటర్లు జైలు నుండి విడుదలైన వారిపై ప్రత్యేక నిఘా సారించాలని కోరారు. సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య , లీగల్ అడ్వయిజర్ శ్రీనివాసులు రెడ్డి, సబ్ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పి జి కృష్ణకాంత్

## విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ

**ప్రజాశక్తి-నెల్లూరు** :ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్తుకు అడుగు పడుతుందని జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు అన్నారు. శనివారం ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా నగరంలోని 5వ డివిజన్ సత్యనారాయణపురం, వైకుంఠపురం ప్రాథమిక పాఠశాలలో ఉన్న సుమారు 200 మంది విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుజయ్ బాబు మాట్లాడారు.

# త్వరలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు పూర్తి

**ప్రజాశక్తి-నెల్లూరు**

నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా గతంలో ఆగిపోయిన అభివృద్ధి పనులన్నింటిని పునఃప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొం గూరు నారాయణ తెలియ జేశారు. నగర నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వరపురం ఇస్లాంపేటలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా భూగర్భడ్రెయినేజీ బ్లూప్రింట్ ప్లానింగ్‌ను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్‌కట్టింగ్ మిషన్‌తో మంత్రి స్వయంగా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ 2014-19లో తాను మంత్రిగా ఉన్న సమయంలో నెల్లూరును స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దేందుకు రూ.580 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేయించామన్నారు. అదేవిధంగా రాబోయే తరాల వారిని దృష్టిలో పెట్టుకుని నగరవాసులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు సంగం బ్యారేజి నుంచి మరో రూ.550 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు.అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, 54 డివిజన్ ఇన్‌ఛార్జ్ జహీర్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్‌పి చైర్మన్ విజేతరెడ్డి, కమిషనర్ సూర్యతేజ, ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, టీడీపీ ముఖ్యనేతలు, తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారాయణ

# నారాయణలో రాయితీతో దంతవైద్యసేవలు

**ప్రజాశక్తి-నెల్లూరు** :నగరంలో నారాయణ దంత వైద్యశాల ప్రజలకు వైద్యసేవలందించడంలో 24 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకోని 25వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఈ నెల 2నుంచి 31వ తేదీ వరకు రాయితీతో కూడిన దంత వైద్యసేవలం దిస్తున్నట్లు నారాయణ దంత వైద్యశాల ప్రిన్సిపల్ డాక్టరు అజయ్ రెజనాల్డ్ పేర్కొన్నారు. శనివారం నారాయణ దంత వైద్యశాలలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వైద్యశాలలో దంత చికిత్సల నిమిత్తం ప్రత్యేక ప్యాకేజీ ద్వారా రాయితీ అవకాశం కల్పిస్తున్నామన్నారు. చిన్నపిల్లల దంత సంరక్షణకు 50 ప్రత్యేక ఉచిత వైద్యశిభిరాలు, కళాశాలలోని విద్యార్థినీ, విద్యార్థుల కోసం 50 ప్రత్యేక దంత వైద్యశిభిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దంత సంరక్షణ ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణం కోసం ముఖ్యమన్న నినాదంతో 150కి పైగా ఉచిత దంత వైద్యశిభిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా అవగాహన సదస్సులు సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9 ప్రత్యేక విభాగాలల్లో మొట్టమొదటిగా కట్టుడు పళ్ల విభాగంలో 6 రకాల సేవలు రాయితీతో కూడిన చికిత్సలు అందజేస్తామన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ సదుపాయం కోసం 7331170047,7780473823 సెల్‌ఫోన్‌నెంబర్లను సంప్రదించాలన్నారు. చివరగా ఉచిత వైద్యశిభిరానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు టి.పవన్‌కుమార్, వి.దిలీప్‌నాగ్; ఏజిఎం సిహెచ్ భాస్కర్‌రెడ్డి, డాక్టరు వి.వంశీకృష్ణారెడ్డి, కె.ఎ శరణ్‌బాబు, ఎఒయు ఆరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

## శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి-నెల్లూరు:** వైద్య ఆరోగ్యశాఖలో డెమోగా ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన బి.శ్రీనివాసరావు సేవలు అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో వైద్యశాఖలో డెమోగా సేవలందించిన బి. శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టరు ఎం.పెంచలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న బి.శ్రీనివాసరావు దంపతులను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ఆర్ఎంపి గౌస్ బాషా, చేజర్ల సుధాకర్ రావు, నవాజ్ పాల్గొన్నారు.

## దంత వైద్య పరీక్షలు



**ప్రజాశక్తి-కావలి** : పి.ఎస్.ఆర్. ట్రస్ట్ హాస్పిటల్ కావలిలోని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.ప్రభాకర్ నాయుడు సూచనలతో విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి షేక్.బాషా ఆధ్వర్యంలో శనివారం వెంగళరావు నగర్‌లో గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో దంతవైద్య నిపుణులు డాక్టర్ వినయ్ వినోద్ బాబు పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ ఎస్.శ్యామ్ సుధాకర్ ఆహ్వానం మేరకు విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి బాషా మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌సుధాకర్ కోరిక మేరకు విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించామన్నారు. ఎక్కడ వైద్య శిబిరాలుంటాయో అక్కడ అభివృద్ధి తాండవిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల సిబ్బంది, వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

## 3న జాబ్‌మేళా

**ప్రజాశక్తి-కావలి** : ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్తంగా 3న కావలి విక్రమ సింహపురి యూనివర్సిటీ పిజిసెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో కె.ఎల్. గ్రూప్ అమెజాన్, అపోలోఫార్మసీ, ఆక్సిజన్ లిమిటెడ్, టిసిఎల్, గ్రీన్‌టెక్ పరిశ్రమలు, డైకిన్, అమర్ రాజా బ్యాటరీస్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. కావలి నియోజకవర్గ యువత అందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొని ఈ సదవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎస్‌ఎస్‌డిసి జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వినీల్‌కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ విజయ్‌కుమార్, విఎస్‌యు పిజిసెంటర్ ప్రిన్సిపాల్ తెలియజేశారు. వివరాలకు ఫోన్ 8074634065, 6301543185 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## కార్మిక పరిషత్ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి-కావలి** : ఆర్‌టిసి బలోపేతానికి టిడిపి, చంద్రబాబు అభిమానులైన కార్మికులు తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టిఎన్‌టియుసి) అనుబంధ కార్మిక పరిషత్‌లో సభ్యులుగా చేరాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్‌టిసి డిపోలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త బస్సు కూడా కొనుగోలు చేయలేదని, కార్మికులకు ఇవ్వాల్సిన భత్యాలను ఇవ్వలేదని, పర్మినెంట్ ఆర్‌టిసి నిర్వీర్యం చేశారన్నారు. ఆర్‌టిసి మనుగడను, కార్మిక హక్కులను కాపాడుకోవడానికి కార్మిక పరిషత్ బలపరచాలన్నారు. ఈ సందర్భంగా కావలి డిపో కమిటీని ప్రకటించారు. డిపో మేనేజర్ రాఘవ శ్రీనివాసులను పరిచయం చేశారు. డిపో కమిటీ సలహాదారులుగా సీనియర్ కార్మిక నాయకుడు గురజాల నాగేశ్వరావు, అధ్యక్షులుగా కె వి రమణయ్య, డిపో కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎం.సూరిబాబు, సహాయ కార్యదర్శిగా సింహాద్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బ్రహ్మారెడ్డి, మరో పదిమందిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు శేషగిరిరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వై.రాము, ప్రచార కార్యదర్శి వై.రమేష్, కోశాధికారి సురేంద్ర, నెల్లూరు రీజియన్ ప్రచార కార్యదర్శి కామేశ్వరరావు, డిపోకార్మిక నాయకులు బలరామయ్య, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## రిటైర్డ్ పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు

**ప్రజాశక్తి-నెల్లూరు** : సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి జి.కృష్ణకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగ విరమణ చేసిన వారికి ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని, పోలీసు శాఖలో మీరు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన అందరికీ పదవీవిరమణ, బదిలీ అనేవి తప్పనిసరని, ఇన్నాళ్ళు తల్లిదండ్రులు మీ కుటుంబం కోసం ఎంతో కష్టపడి ఉంటారని, ఉద్యోగ విరమణ చేసిన అనంతరం పిల్లలు వారికి కావాల్సినవి అందించి, సంతోషంగా గడపాలని పిలుపు నిచ్చారు.

## చెట్లను రక్షించుకోవాలి

**ప్రజాశక్తి -వరికుంటపాడు** : చెట్లను కుటుంబ సభ్యులు మాదిరిగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని తిమ్మారెడ్డిపల్లి ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు లాజర్, అంగన్‌వాడీ కార్యకర్త రజీయా అన్నారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి పాఠశాల ప్రాంగణంలో అల్లనేరేడు ఇతర మొక్కలు నాటి మన రేపటి తరం కోసం ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో కోటిన్నర మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వచ్చిన చెట్టే వర్షం మనిషికి ప్రాణదాతమైనా ఆక్సిజన్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా కృష్ణకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముసురు పట్టి కురుస్తున్న వర్షం

- పునాస మామిడికి నష్టం

**ప్రజాశక్తి-కందుకూరు** : కందుకూరు రెవెన్యూ డివిజన్ వర్షం ముసురు పట్టి కురుస్తుంది. గురువారం రాత్రి నుంచి వర్షం ప్రారంభమైంది. శుక్రవారం కొంత తెరిపినిచ్చినప్పటికీ శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం ముసురు పట్టి కురుస్తూనే ఉంది. జల్లులు జల్లులుగా వర్షం కురుస్తుంది. కందుకూరు పట్టణంలో శనివారం ఉదయం 10:00 సమయానికి 14.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండల కేంద్రమైన ఉలవపాడులో 12.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. లింగసముద్రం మండలంలో 8.6మిల్లీమీటర్లు వలేటివారిపాలెం మండలంలో 8.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. గుడ్లూరు మండలంలో 7.4 మిల్లీమీటర్ల వర్షం కురవగా కొండాపురం మండలంలో 10.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వరికుంటపాడు మండలంలో అతి తక్కువగా 2.04మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మామిడి, సపోటా, సరివి, జామాయిల్ తోటలకు ఈ వర్షం వల్ల కొంత ప్రయోజనం చేకూరింది. అయితే ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో విస్తారంగా ఉన్న పునాస మామిడి తోటలకు కొంత నష్టం చేకూరింది. పునాస మామిడి తోటలు ఇప్పుడు పూత, పిందెలు, కాయల దశలో ఉన్నాయి. మూడు రోజులుగా మేఘాలు కమ్మి వర్షాలు కురుస్తుండగా పునాస తోటల్లో తెగుళ్ళు ముమ్మరించే అవకాశం ఉంది.

## గుడ్లూరులో అన్నదానం

**ప్రజాశక్తి-గుడ్లూరు** : గుడ్లూరులోని మిట్టపాలెంలో వినాయకుని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా కమిటీ సభ్యులు సుమారు మూడు వేల మందికిపైగా అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామంలో అన్ని కాలనీలకు చెందిన గ్రామస్తులు హాజరయ్యారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం

**ప్రజాశక్తి-కోవూరు** : మండలంలోని వేగూరు పంచాయతీ కండ్రిగ ప్రాంతంలో ఇందురుపల్లి అశోక్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి ఇల్లు దగ్ధమైన ఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఇంట్లో ఉన్న సుమారు రూ.5లక్షల విలువైన అన్ని వస్తువులు కాలిపోయాయి. వివరాల మేరకు.. బుచ్చి మున్సిపల్ కమిషనర్ కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఇందురుపల్లి అశోక్ ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో వెంటనే స్థానికులు ఫోన్ చేసి చెప్పారు. అశోక్ వచ్చే సమయానికి అంతా కాలిబూడిదైంది. ఇంట్లో ఉన్న విలువైన ఫర్నీచర్, తదితర వస్తువులన్నీ కాలిపోయాయి. ఫైర్ సర్వీస్ వాళ్ళు వచ్చేసరికి అంతా కాలిపోవడంతో ఏం చేయాలో అర్థం కాక కోవూరు తహశీల్దారు నిర్మలానందబాబాకు సమాచారం అందించారు. ఆయన తన సిబ్బందిని పంపి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన మేరకు సహాయమందేలా కృషి చేస్తామన్నారు.

## గణేష్ ఉత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : పట్టణంలోని జెఆర్‌పేట, ఎక్స్ టెన్షన్ ఏరియాలో శనివారం ఉదయం వినాయక చవితి ఉత్సవాలను గణేష్ భక్తమండలి సభ్యులు భూమిపూజ నిర్వహించి ప్రారంభించారు. సెప్టెంబర్ 7, 8, 9 తేదీలలో మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు, తీర్థప్రసాద వితరణ, ప్రతిరోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన జనసైనికులు

**ప్రజాశక్తి-కావలి** : జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి, పర్యావరణ శాఖమంత్రి, అటవీశాఖ మంత్రి గౌరవనీయులు కొణిదెల పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు కార్యక్రమంలో జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ సూచనల మేరకు కావలి నియోజకవర్గంలో మొదటి రోజు మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు శనివారం జనసేన జిల్లా కార్యదర్శి సమ్మును వెంకటసుబ్బయ్య తెలిపారు. కావలిలోని 40 వార్డులు, కావలి రూరల్ మండలంలోని రుద్రకోట గ్రామ హైస్కూల్లో, హరిజనవాడ స్కూల్లో, గిరిజన ప్రాథమిక పాఠశాలలో మొక్కలు జనసైనికులు వీర మహిళ ఉపాధ్యాయుల విద్యార్థిని విద్యార్థుల మధ్యలో ఆయా ప్రాంగణంలో సుమారు 200 మొక్కలు నాటామన్నారు. జనసేన పట్టణ అధ్యక్షులు పొట్ల సాయి విటల్, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కావలి నియోజకవర్గం అధ్యక్షులు ఆలా శ్రీనాథ్ పాల్గొని ప్రసంగించారు. సీనియర్ నాయకులు గుంటుపల్లి కిష్టయ్య, తోకల వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, వీరమహిళ కందుల లక్ష్మి కవిత, నాని, జానీ, షేక్, జిల్లారి రమణయ్య, గాదంశెట్టి రవి, గడి నాగార్జున, రాము, ప్రవీణ్, మురళీకృష్ణ, జ్యోతి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్లు పంపిణీ



పింఛన్‌ను అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్



కావలిలో పింఛన్ ఇస్తున్న ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి

**ప్రజాశక్తి-నెల్లూరు** : జిల్లా వ్యాప్తంగా 95శాతం వరకు పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో శనివారం రోజునే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మొదలు పెట్టినట్లు ఆయన చెప్పారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ మొదలు కాగా, రాత్రి 7 గంటల సమయానికి 95 శాతం వరకు పింఛన్లను ప్రభుత్వ అధికారులు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేసినట్లు ఆయన చెప్పారు. కోవూరు, నెల్లూరు, బుచ్చిరెడ్డిపాలెం, రాపూరు మండలాల్లో అత్యధికంగా 96 శాతంపైగా పింఛన్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా పింఛన్లు తీసుకొని వారు ఉంటే వారందరికీ సోమవారం పింఛన్లను అందిస్తామని చెప్పా రు. ఇదిలా ఉండగా నెల్లూరు నగరం లోని మూలాపేట శ్రీ పొట్టి శ్రీరాములు బొమ్మ సమీపంలో కలెక్టర్ పింఛన్లు పంపిణీ పంపిణీ చేశారు.

**ప్రజాశక్తి-ఉదయగిరి** : మండలంలోని 17 పంచాయతీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఎంఎల్ఎ కాకర్ల సురేష్ సూచనల మేరకు కొండాయపాలెం పంచాయతీలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు ఎంపిడిఒ ఈశ్వరమ్మ, టిడిపి మండల అధ్యక్షులు చింతన బయన్న, మాజీ సర్పంచులు ముఖ్యనేతలు ఉమ్మడి నాయకులు పంపిణీ చేశారు. దాసరపల్లిలో మాజీ సర్పంచ్ ఎస్‌వి చింతలలో జల్సాయాదవ్ స్థానిక పట్టణంలో కోళ్ల వీధిలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌ను రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్ తెలుగు యువత అధ్యక్షుడు సయ్యద్ సందాని పార్టీ కార్యకర్తలు సయ్యద్ అలీ జాన్ ఇలియాజు షానవాజ్ సయ్యద్, అక్లీం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి వైస్ ఛైర్మన్ బొజ్జ నరసింహులు యాదవ్, సీనియర్ నాయకులు మన్యం వెంగయ్య చౌదరి, గడ్డం నాయుడు, మాజీ సర్పంచ్ అవుల మధు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో శనివారం ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ టిడిపి నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు మున్సిపల్ ఎఇ ప్రసాద్‌తో కలిసి పట్టణంలోని 21వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులో మేరకు 31వ తేదీ పింఛన్ల కార్యక్రమం నిర్వహించామన్నారు. లబ్ధిదారులకు ఆరు గంటల నుండి పింఛన్ల పంపిణీ చేశామని తెలియజేశారు.

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శనివారం ఎంపిపి కేత వేణు గోపాల్ రెడ్డి మండలంలోని పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6గంటల నుండి అందరూ సిబ్బందితో పింఛన్ల కంపెనీ కార్యక్రమం ప్రారంభించారు. ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ చేయడం లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

**ప్రజాశక్తి-బిట్రగుంట** : బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక్కరోజు ముందే ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించామని డిజిటల్ అసిస్టెంట్ శ్యామ్ సుధాకర్ తెలిపారు. కార్యక్రమానికి పంచాయతీ సెక్రటరీ లక్ష్మీ ప్రసున్న, టిడిపి సీనియర్ నాయకులు ఇందుపూరి రాము మోహన్ రెడ్డి, నాటక రాణి సీనయ్య, నాటకరాని రంగయ్య, నాటకరాని భాస్కర్, తదితరులున్నారు.

**ప్రజాశక్తి - కావలి** : నియోజకవర్గంలో తెల్లవారుజాము నుండే పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. శనివారం కావలి పట్టణం 12వ వార్డు అరుంధతీయవాడలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. వర్షంలో సైతం పెన్షన్లను పంపిణీ చేస్తున్న అధికారులను, సిబ్బందిని ఎంఎల్ఎ అభినందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడోసారి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇ సాయి రామ్, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, టిడిపి నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, వార్డు నాయకులు దావులూరి దేవకుమార్, అక్కిలగుంట సూర్య ప్రకాష్, హరి నారపరెడ్డి, పోట్లూరి శ్రీనివాసులు, మందా రమేష్, బొమ్మా రమణయ్య, వంశీ, సింగయ్య, ఎమ్మెస్, పర్వతరెడ్డి వేణు, జలదంకి శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



భూములను పరిశీలిస్తున్న అధికారులు

## ఆలయ భూముల ఆక్రమణపై ఆరా..

- ప్రజాశక్తి వార్తకు స్పందన

**ప్రజాశక్తి -వరికుంటపాడు**

మండలంలోని వేంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 78-1లో 6.08 ఎకరాలు ఉన్న శ్రీ మదనవేణుగోపాల స్వామి దేవాలయ భూమిని కొంతమంది వైసిపి నాయకులు ఆక్రమించారాని ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన కథనానికి దేవాదాయ శాఖ అధికారులు స్పందించారు. శనివారం డిప్యూటీ కమిషనర్ బొంతు మహేశ్వర రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కె.జనార్ధన్ రెడ్డి, సూపరిండెంట్ శ్రీధర్‌రెడ్డి ఆక్రమణకు గురైన భూమి వద్దకు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జాయింట్ కమిషనర్ (ల్యాండ్స్) చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చామన్నారు. ఇందుకు సంబంధించి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని ఇఒ నరసింహ బాబుకు ఆదేశాలు జారీ చేశామన్నారు.



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖ అధికారి గోపాల్

## పాఠశాలల్లో పరిశీలన

**ప్రజాశక్తి-మర్రిపాడు**

మండలంలోని చుంచులూరు, కదిరినాయుడు పల్లి, టిఎన్ పేట, బ్రాహ్మణపల్లి, కంపసముద్రం ఉన్నత పాఠశాలల్లో శనివారం ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గోపాల్ సందర్శించారు. పాఠశాల రికార్డులు తనిఖీ చేసి, ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేననీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. సందర్శన సందర్భంగా వారి దృష్టికి వచ్చిన పాఠశాలల్లోని పలు రకాల సమస్యలకు సామరస్యంగా పరిష్కార మార్గాలను చూపారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ధనలక్ష్మి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఎంఆర్‌టి కస్తూరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయ హాకీ పోటీలకు జస్వంత్ ఎంపిక

- అభినందనలు తెలిపిన ఎంఎల్‌సి చంద్రశేఖర్ రెడ్డి



**ప్రజాశక్తి-నెల్లూరు**

పంజాబ్ రాష్ట్రంలోని జలందర్‌లో సెప్టెంబర్ 9 నుంచి జరిగే జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన కృష్ణచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి సబ్బి జస్వంత్‌ను ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అభినందించి, సహకారం అందించారు. జాతీయ హాకీ క్రీడల్లో పాల్గొని జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని చంద్రశేఖర్ రెడ్డి సూచించారు.

## ఖలీల్ అహ్మద్‌కు ఎంఎల్‌సి పరామర్శ

**ప్రజాశక్తి-నెల్లూరు**



అనారోగ్యంతో మెడికవర్ హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన నెల్లూరు నగర నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఖలీల్ అహ్మద్‌ను శనివారం మరోసారి ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నెల్లూరు జెండావీధిలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఖలీల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు వైసిపి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

## విట్స్‌లో 'అప్లికేషన్స్ ఆన్ డేటా మైనింగ్'

**ప్రజాశక్తి-కావలి** : విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎఐ అండ్ ఎమ్.ఎల్ విభాగంలో శనివారం "అప్లికేషన్స్ ఆన్ డేటా మైనింగ్" శీర్షికపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లక్కిరెడ్డి బాలిరెడ్డి, అధ్యాపకుడు డాక్టర్ సురేష్ పసంగిస్తూ, డాటా మైనింగ్ అధునాతన పరిజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను కూడా నివృత్తి చేసుకొన్నారు. ఎ.ఐ అండ్ ఎమ్.ఎల్ విభాగాధిపతి డాక్టర్ మల్లిశెట్టి ప్రవీణ్‌కుమార్ సదస్సులో ప్రసంగించిన వక్తను అభినందించారు. విద్యార్థుల ఆసక్తి మేరకు ఇటువంటి సాంకేతిక సదస్సులు భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య డేటా మైనింగ్ భవిషత్తు సమాజాన్ని చాలా ప్రభావితం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

## చీరలు పంపిణీ

**ప్రజాశక్తి-కావలి** : జనసేన అధినేత, డిప్యూటీ సిఎం జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం కావలి ఏరియా హాస్పిటల్‌లో నియోజకవర్గ వీర మహిళ కందుల లక్ష్మికవిత ఆధ్వర్యంలో శానిటేషన్ డిపార్ట్‌మెంట్లో పని చేస్తున్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో సానిటరీ సిబ్బందికి చీరలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సమ్మును వెంకటసుబ్బయ్య, హాస్పిటల్ డైరెక్టర్ పోబ్బ సాయి విటల్, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ నియోజకవర్గం అధ్యక్షులు ఆలా శ్రీనాథ్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ గాదంశెట్టి రవికుమార్, తోట శరన్నా కుమార్, శానిటరీ డిపార్ట్మెంట్ హెడ్ రాగిణి, వీర మహిళలు భవాని, ఆలా మాధురి, శిరీష, నాయకులు గుంటుపల్లి కృష్ణయ్య, నాని, మహేంద్ర, రాము, పవన్, భాస్కర్ పాల్గొన్నారు.

## నేడు మంత్రి ఆనం పర్యటన

**ప్రజాశక్తి-మర్రిపాడు** : రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదివారం మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు కృష్ణాపురంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలకు శంకుస్థాపన, మధ్యాహ్నం బ్రాహ్మణపల్లిలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంటును వారు ప్రారంభిస్తారు.

## పరీక్ష ఫలితాలపై హర్షం

**ప్రజాశక్తి-కోవూరు** : గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ అభ్యసించిన వారి, పరీక్ష ఫలితాలు విడుదలైందని మంచి ఫలితాలు సాధించారని గీతాంజలి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ కుమార్ అన్నారు. ఆటానమస్ గుర్తింపు పొందిన ఈ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు అభినందనలు తెలిపారు. జెఎన్‌టియు ప్రొఫెసర్ జివి నగేష్ కుమార్ పర్యవేక్షణలో ఫలితాలను విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులున్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి-అనంతసాగరం**



వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

వెలుగు విఒఎల యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెలుగు విఒఎ యునియన్ మండల నాయకులు లక్ష్మి మాట్లాడుతూ వెలుగు విఒఎలకు 2024 మార్చి నుండి బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు వేతనాలకు సంబంధించి అనేక పర్యాయాలు అధికారులకు వినతి పత్రాలు అందించామని కొత్త ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే స్పందించి బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలన్నారు.ఆర్థిక ఇబ్బందులు నుండి విఒఎల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గత రెండు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా వెలుగు విఒఎలను అక్రమ తొలగింపులకు, వేధింపులకు గురవుతున్నారని, అనేకమందిని తొలగించారు. మరి కొంతమంది ని తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమ తొలగింపులను ఆపాలని కోరారు. మండలంలో కూడా వెలుగులో పని చేసే వారిని తొలిగించవద్దన్నారు. కార్యక్రమంలో వెలుగు విఒఎల యూనియన్ నాయకులు సుజాత, లక్ష్మి, సౌజన్య, షాహిద, సౌభాగ్యమ్మ, రమణమ్మ, ఆదిలక్ష్మి, నవీన్‌కుమార్, విఒఎలు పాల్గొన్నారు.

## నేడు తుమ్మలపెంట రోడ్డుకు శంకుస్థాపన

**ప్రజాశక్తి-కావలి**



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి

గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అధ్వాన స్థితికి చేరుకొని, ఎంతోమంది వాహనదారుల ప్రాణాలను బలిగొన్న తుమ్మలపెంట రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమం సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం జరగనుందని ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీకి చంద్రబాబు నాయుడు తొలిసారి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి 29సంవత్సరాలు పూర్తి కావడం, అదేరోజున తుమ్మలపెంట రోడ్డుకు శంకు స్థాపన చేపట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. నిర్లక్ష్యానికి అంతిమయాత్ర కడుతూ ఉదయం 7.30 గంటలకు కావలి పట్టణంలోని భారత్ గ్యాస్ వద్ద నుండి తుమ్మల పెంట వరకు 9 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి, రోడ్డుకు శంకుస్థాపన మహిళల చేత చేయించడం జరుగుతుంద న్నారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పాల్గొంటారని తెలిపారు. ఎన్నోయేళ్లుగా రోడ్డు లేక ప్రమాదాలకు గురవుతున్న మత్స్యకారుల కల నేరవేరే సమయం ఆసన్నమైందని తెలిపారు. పెద్దఎత్తున ప్రజలు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి-కలిగిరి**



డిప్యూటీ సిఎం, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నియోజకవర్గ ఉమ్మడి పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కలిగిరి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆర్ అండ్ బి బంగ్లా సెంటర్‌లో నియోజకవర్గస్థాయి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజక వర్గంలోని ఉమ్మడి పార్టీ నాయకులు యువత పవన్ కళ్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని రక్త దానం చేసి ప్రాణదాతలుగా మారాలని ఆయన కోరారు.

## ఎస్‌టిలకు బర్త్ సర్టిఫికెట్లు అందజేత

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్‌డిఒ మధులత

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆధార్‌కార్డు లేని ఎస్‌టి కుటుంబాలకు ఆధార్ నమోదు చేసుకునేందుకు వీలుగా జనన ధృవీకరణ పత్రాలను మంజూరు చేసినట్లు ఆత్మకూరు ఆర్‌డిఒ మధులత పేర్కొన్నారు. శనివారం మండలంలోని మహిమలూరు గ్రామంలో ఎస్‌టి కుటుంబాల విరికి జనన ధృవీకరణ పత్రాలను జారీ చేసి వారి ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మధులత మాట్లాడుతూ ఎస్‌టి కుటుంబాలు ఆధార్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, వారికి అధికారులు సహకారం అందిస్తారన్నారు. ఆమెవెంట తహశీల్దారు సుధీర్, ఆర్‌ఐ పృథ్వీ తదితరులు ఉన్నారు.

## ముగిసిన క్రీడా దినోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి-కావలి**



జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో సుప్రసిద్ధ జాతీయ హాకీ క్రీడాకారుడు "మేజర్ ధ్యాన్‌చంద్" జయంతి సందర్భంగా ఆగస్టు 29 నుండి 31వ తేదీ వరకు జాతీయ క్రీడాదినోత్సవాలను కళాశాల ఫిజికల్ ఎడ్యు కేషన్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి.ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మొదటిగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి విద్యార్థిని, విద్యార్థులకు వాలీబాల్ బాస్కెట్ బాల్, షటిల్ బ్యాట్మెంటన్, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్ (మెన్) మొదలగు క్రీడలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో ధ్యాన్ చంద్‌ను ఆదర్శంగా తీసుకొని వారి క్రీడలలో ప్రతిభ కనబరిచి అంతర కళాశాల, అంతర విశ్వవిద్యాలయ, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించి కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని తెలియజేశారు. కార్యక్రమంలో సెల్ఫ్ ఫైనాన్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొని విద్యార్థులను ప్రోత్స హించారు.

## కోటపాడులో అన్నదానం

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

మండలంలోని మహిమలూరు పంచాయతీ మజారా కోటపాడు గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించబడిన అభయాంజనేయ స్వామి, శ్రీ కోదండ రామస్వామి గుడి నిర్మాణాలు పూర్తి కావడంతో శనివారం అక్కడికి విచ్చేసిన భక్తులకు నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ రెండు రోజుల పాటు అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అండగా నిలబడుతున్న కంచి పరమేశ్వరరెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

## మొక్కలు నాటిన సిడిపిఒ

**ప్రజాశక్తి-ఉదయగిరి**

ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణంలో శనివారం సిడిపిఒ పచ్చవ లావణ్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషన్ అభియాన్ కింద తల్లి పేరుతో మీద ఒక చెట్టు మన రేపటి కోసం అనే నినాదంతో ప్రతిఒక్క అంగన్‌వాడీ కార్యకర్తలు సిబ్బంది వారిపేర్లపై మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## పాఠశాల చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం

**ప్రజాశక్తి-వరికుంటపాడు** : మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్నిక కోరమ్ లేక రెండు సార్లు వాయిదా పడిన ఎన్నికను తాజాగా శనివారం నిర్వహించారు. ఏకగ్రీవం చైర్మన్‌గా గవ్వల వెంకట లక్ష్మమ్మ, ఉప చైర్మన్‌గా మందా నరేష్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా కాంతారావు, వ్యవహరించగా ఎంఇఒ షాహుద్దీన్ పర్యవేక్షణ చేశారు. ప్రధానోపాధ్యా యులు ప్రభాకర్ ఉన్నారు.

## 4500 మొక్కలు పంపిణీ

**ప్రజాశక్తి-కావలి** : ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు కొణెదల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కావలి జనసేన ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ "క్లీన్ ఆంధ్రా అండ్ గ్రీన్ ఆంధ్రా"లో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా 4500 మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం, 4 మండలాల అధ్యక్షులకు, నాయకులకు, జనసైనికులకు, వీర మహిళలకు పంపిణీ చేశామని తెలిపారు. మస్తాన్, వేణు, సుధీర్, బాలు, లక్ష్మి, మండల అధ్యక్షులు కార్తీక్ శర్మ, వెంకట్ యాదవ్, వెంకటేష్, గుడిపల్లి వెంకయ్య, రాజేష్, ప్రకాష్, అగస్టిన్, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల చిరకాల స్వప్నం 'ఫిషింగ్ హార్బర్'

**ప్రజాశక్తి-నెల్లూరు**

జిల్లాకు చెందిన మత్స్యకారుల చిరకాల స్వప్నం 'ఫిషింగ్ హార్బర్'. కొన్ని ఏళ్ల నుంచి అదుగో.. ఇదుగో.. అంటూ మత్స్యకార కుటుంబాలతో దోబూచులాడుతున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మోక్షం లభించింది. శుక్రవారం మహారాష్ట్ర ప్రాంతంలోని పాల్గర్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం నుంచి వర్చువల్ పద్ధతిన ప్రధాని నరేంద్రమోడి ప్రారంభించారు. కృష్ణపట్నం పోర్ట్ అదాని చేజిక్కించుకున్న తర్వాత తమ యాజమాన్యంలోని ఇతర పోర్టులలో వ్యాపార లావాదేవీల కోసం జిల్లా ప్రయోజనాలను తాకట్టు పెట్టే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కృష్ణపట్నం పోర్టులో కంటైనర్లను లోడింగ్ అన్లోడింగ్ చేసే క్రేన్లలలో మార్పులు కనిపిస్తున్నాయి. ఐరన్ ఓర్ ని, కోల్ ని లోడింగ్, అన్లోడింగ్ చేసుకునే క్రేన్ ఏర్పాటును పరిశీలిస్తే పోర్ట్ లో కంటైనర్ల కార్యకలాపాలు ఉండవు అనేదానికి సంకేతంగా కార్మికులు బావిస్తున్నారు. గతంలో ప్రతిపక్ష హెూదాలో ఉన్న ప్రస్తుత సర్వేపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ కొనసాగించే విధంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని కార్మికులు సూచన చేస్తున్నారు. ప్రభుత్వం ఆశయసాధనలో భాగంగా, "వనమహోత్సవం - 2024" అనే కార్యక్రమాన్ని పురస్కరించు కుని జిల్లా అధికార యంత్రాంగం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. రానున్న ఐదేళ్లలో జిల్లాలోని 6 నగర వనాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రకటించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియం నుంచి కరెంట్ ఆఫీస్ సెంటర్ వరకు క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. నగరంలో ప్రజలను పట్టిపీడిస్తున్న విష జ్వరాలను నివారణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలు జ్వరాలతో విలవిలలాడుతున్న నేపథ్యంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల నాయకులు కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి సమీపంలో 25వ తేదీన హత్యకు గురైన రౌడీ షీటర్ గుంజి రవి, అలియాస్ కత్తి రవి కేసుకు సంబంధించి లక్ష్మి శెట్టి సాయి తేజ, వాడేపల్లి వెంకటేష్, అరవభూమి సుజన్ క్రిష్ణ, కాసారం వంశీకృష్ణ, తమ్మిరెడ్డి పవన్‌కుమార్, మల్లి నారాయణ అను ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**వీక్షణం**

సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో శనివారం రోజునే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా అధికారులు ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ మొదలు కాగా, రాత్రి 7 గంటల సమయానికి 95 శాతం వరకు పింఛన్లను ప్రభుత్వ అధికారులు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేసినట్లు అధికారులు ప్రకటించారు.